క్లుప్తంగా

మూత్రపిండాల వ్యాధులపై అవగాహన ఉండాలి



హనుమాన్‌జంక్షన్ రూరల్: జీవనశైలి మార్పుల వల్ల అధికంగా వస్తున్న మూత్ర పిండాల సంబంధిత వ్యాధులతో ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అమ్మన్న అన్నారు. బాపులపాడు మండలం కోడూరు పాడు, అంపాపురంలో అరుణ్ కిడ్నీ కేర్ సెంటర్ (విజయవాడ) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ అమ్మన్న, డాక్టర్ శ్రీలక్ష్మి మూత్రపిండాల సంబంధిత వ్యాధులు రాకుండా పాటించాల్సి జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను వివరించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ చందు రమాదేవి, అంపాపురం, కోడూరుపాడు సర్పంచ్‌లు కాకాని సంజయ్, ఆర్నేపల్లి, గ్రామ ప్రముఖులు చందు శ్రీనివాసరావు, ఆర్నేపల్లి రవివర్మ పాల్గొన్నారు.

25 వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడు, శోభనాద్రిపురం గ్రామాల్లో దుండగులు శనివారం రాత్రి చేలరేగిపోయారు. ఆయా గ్రామాల పరిధిలో ఒకే రాత్రి 25 వ్యవసాయ విద్యుత్ మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని వైర్లు అపహరించుకు పోయారు. యధాతథంగా ఆదివారం ఉదయం పంట పొలాల్లోకి వెళ్లిన రైతులు వ్యవసాయ మోటార్లు మాయం కావటం చూసి నిర్ఘాంతపోయారు. రైతులు ఒకరికొకరు ఆరా తీస్తే రెండు గ్రామాల్లో మొత్తం 25 చోట్ల చోరీలు జరిగినట్లుగా తేలింది. పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి దానిలోని రాగి తీగను దొంగిలించి పరారయ్యారు. ఈ చోరీలపై బాధిత రైతులు వీరవల్లి పోలీసులకు తెలిపారు. పంట పొలాల్లో విద్యుత్ మోటార్ల చోరీలపై ఆయా రైతులు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు మారేడుమాకలో రీసర్వే

కంకిపాడు: మండలంలోని మారేడుమాక గ్రామంలో ఈనెల 20న రైతు వారీ భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీ భావనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మారేడుమాక గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు తమ దస్తావేజు పత్రాలతో షెడ్యూల్ ప్రకారం సర్వేకు సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: హంసధ్వని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పటమట దత్తపీఠంలోని శ్రీ మరకత రాజ రాజేశ్వరీ క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కొవ్వూరుకు చెందిన యనమండ్ర శ్రీనివాస శర్మ సంగీతంలో జ్ఞానదృష్టి అంశంగానూ సంస్కృత పండితులు యనమండ్ర వేణుగోపాల శాస్త్రి ఉపాసనా విశిష్టమైన భక్తి అంశంగా సోదాహరణంగా వివరించారు. నిర్వాహక సంఘ సభ్యుడు గోపీకృష్ణ శర్మ మాట్లాడుతూ సోమవారం నాటి సంగీత కార్యక్రమాలు ఉదయం హరిద్రా మ్యూజిక్ అకాడమీ విద్యార్థుల బృందగానంతో ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు పాల్గొంటారని తెలిపారు.

గుణదల సబ్ స్టేషన్‌లో నేటి నుంచి మరమ్మతులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన గుణదలలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ హెచ్‌వీ బ్రేకర్‌ని మార్చే పనులను సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గుణదల ఓఅండ్‌ఎం కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.కిరణ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా గుణదల 220 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తామన్నారు. దీనివల్ల విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చునని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేత్ర దానం

కంకిపాడు: నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. కంకిపాడుకు చెందిన నెక్కలపూడి సుధాకర్‌రావు గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు సుధాకర్‌రావు నేత్రాలను (కార్నియాలను) ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రికి వితరణగా అందించారు. సుధాకర్‌రావు కుటుంబాన్ని ఆసుపత్రి ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

డొంక రోడ్లపై దృష్టి ఏదీ

- దెబ్బతిన్న డొంక రోడ్లు
- వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతుల ఇబ్బందులు
- దృష్టిసారించని ప్రభుత్వం, ఏఎంసీలు
- రోడ్లు నిర్మించాలని రైతుల డిమాండ్



అధ్వానంగా బీబీగూడెం వద్ద డొంక రోడ్డు



గోతులమయంగా డొంక రోడ్డు

గన్నవరం రూరల్: వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రధాన ఆధారం డొంకరోడ్లు. ఈ రోడ్లు సక్రమంగా లేకపోతే రైతుల బాధలు చెప్పనలవికానివి. రైతులు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వినియోగించే డొంక రోడ్లు అధ్వానంగా మారాయి. వీటిని బాగుచేయించాల్సిన ప్రభుత్వం, వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో..

గన్నవరం మండలంలో 21 గ్రామాలు ఉండగా, వీటిల్లో 18 వేల ఎకరాలలో వరి సాగు అవుతోంది. ఉద్యాన పంటలైన మామిడి, కూరగాయలు, ఇతర పంటలు 5 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రతి రోజు ఈ భూముల్లోకి వెళ్లాలంటే డొంక రోడ్లే ఆధారం. ముస్తాబాద ఆయకట్టు 5 వేల ఎకరాలకు పైగానే ఉంది. మాదలవారిగూడెం, సూరంపల్లి, సావరగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు, గొల్లనపల్లి, బీబీగూడెం, గోపవరపుగూడెం, చిక్కవరం తదితర గ్రామాల్లో డొంక రోడ్లు కనీసం ఊరికి ఐదుకు పైగా ఉన్నాయి.

డొంకరోడ్ల ప్రాధాన్యత ఇదీ..

విత్తనం చల్లింది మొదలు పంట కోసే వరకు, పంట ఉత్పత్తులను తరలించే వరకూ ఈ డొంక రోడ్లే ఉపయోగిస్తుంటారు. విత్తనాలు తీసుకువెళ్లేందుకు, దుక్కులు దున్నేందుకు, మందు చల్లేందుకు, సాగునీరు పెట్టేందుకు నిరంతరం టైరు బండ్లు, ట్రాక్టర్లు, లారీలు, ద్విచక్రవాహనాలు, ఈ రోడ్లపై రాకపోకలు సాగిస్తుంటాయి.

అధ్వాన స్థితిలో..

తెంపల్లి నుంచి బీబీగూడెం వచ్చే డొంక రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ముళ్లచెట్లతో రోడ్లు కుంచించుకుపోయాయి. రోడ్లు గుంతలు పడిపోయి ఉన్నాయి. అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. కనీసం ఈ వేసవిలో డొంక రోడ్ల దుస్థితిపై అధికారులు దృష్టి పెట్టాలని రైతాంగం కోరుతున్నారు.

మార్కెట్ కమిటీలు దృష్టి సారించాలి..

డొంక రోడ్ల నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ యార్డులు నిధులు సమకూర్చే ఆనవాయితీ ఉంది. ఆ మేరకు నిధులు కేటాయించి రోడ్లు నిర్మించాలి. ఇబ్బందులు లేకుండా వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను ప్రోత్సహించి రైతులను ఆదుకోవాలి.

పంట కాలువలు బాగు చేయాలి

ఏటా వేసవిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల ద్వారా పంట కాలువలు బాగు చేస్తారు. ఈ సంవత్సరం డొంక రోడ్లు పక్కనే ఉన్న పంట కాలువలు బాగు చేయించాలని, ఆక్రమణలు తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించాలి..

పలు గ్రామాల్లో డొంక రోడ్లు ఆక్రమణలకు గురి అయ్యాయి. పంట కాలువలు పరిమాణం తగ్గిపోయాయి. ఏ గ్రామానికి ఆ గ్రామంలో వీఆర్వో చేత డొంక రోడ్లు, పంట కాలువలు సర్వే చేయించి కాపాడాలని రైతాంగం కోరుతున్నారు. సూరంపల్లి, ముస్తాబాద, మాదలవారిగూడెం గ్రామాల్లో పరిశ్రమల వ్యర్థాలు పంటకాలువల్లో, డొంక రోడ్లలో వేస్తున్నారు.

సర్వే చేయాలి

గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన రహదారుల వెంట పెద్దపెద్ద పంట కాలువలుంటాయి. వాటిని సర్వే చేసి ఆక్రమణల చెర నుంచి కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

డొంక రోడ్లను సర్వే చేయాలి



డొంక రోడ్లను సర్వే చేయాలి. కొత్తగా రోడ్లు నిర్మించాలి. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా డొంక రోడ్లపైనే ఆధారపడి ఉంది. పండించిన ధాన్యం తరలించాలంటే ఈ రోడ్లే శరణ్యం. పంట కాలువలు కూడా బాగుచేయించాలి.

– రామినేని రవిబాబు, రైతు, సావరగూడెం

ఉపాధి నిధులు కేటాయించాలి..



ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా డొంక రోడ్లు, పంట కాలువలు బాగు చేయాలి. రైతులకు మేలు చేసే పంట కాలువలు, డొంక రోడ్లను ఆధునీకీకరించాలి. ఎన్‌ఆర్ ఈజీఎస్ ద్వారా ఎస్టిమేట్లు వేయాలి. ఈ వేసవిలో డొంక రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి.

– మల్లంపల్లి ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి, గన్నవరం

అన్న సమారాధన

పెనమలూరు: పోరంకిలో ఆదివారం అయ్యప్ప స్వామి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో లక్ష్మినరసింహా గార్డెన్స్‌లో అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. గ్రామంలో గత కొద్ది సంవత్సరాలుగా అయ్యప్పస్వామి అన్నసమారాధన కార్యక్రమం చేస్తున్నారు. అయ్యప్పస్వామి అన్న సమారాధనలో పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప భక్త బృందం సేవలు అందించారు.

సబ్ జైలులో సదుపాయాల పరిశీలన



గన్నవరం: స్థానిక సబ్‌జైలును ఆదివారం మండల లీగల్ కమిటీ చైర్మన్, సబ్ కోర్టు జడ్జి కె.జయలక్ష్మి నేతృత్వంలో కమిటీ సభ్యులు సందర్శించారు. సబ్‌జైలులో ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయలను, బ్యారక్‌లను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న వైద్య సేవలు, వసతి, భోజనం సదుపాయలు గురించి అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైలులో ఖైదీలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా కమిటీకి తెలియజేయాలని జడ్జి కె.జయలక్ష్మి సూచించారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా సబ్‌జైలు పరిశీలన చేసినట్లుగా తెలిపారు. జైలర్ రాంబాబు, కమిటీ సభ్యులు ఆర్డీఓ స్వాతి, గుడివాడ డీవైఈఓ పద్మరాణి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, వైద్య శాఖ నుంచి డాక్టర్ కె.హిమబిందు, ప్యానల్ న్యాయవాది శారద, పారా లీగల్ వలంటీర్ రామినేని రవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

78 మందికి గ్రహణం మొర్రి ఆపరేషన్లు



ఆపరేషన్ స్మైల్ ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్ జనరల్

చిన్నఆవుటపల్లి(గన్నవరం): మండలంలోని చిన్నఆవుటపల్లిలో ఉన్న డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ హాస్పటల్‌లో గత ఎనిమిది రోజులుగా జరుగుతున్న ఉచిత గ్రహణం మొర్రి ఆపరేషన్ల శిబిరం ఆదివారం ముగిసింది. ఆపరేషన్ స్మైల్ స్వచ్ఛంద సంస్థ, పిన్నమనేని సిద్ధార్థ హాస్పటల్ సంయుక్తంగా ఈ ఉచిత శస్త్రచికిత్సలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ స్మైల్ ప్రతినిధులకు హాస్పటల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 12 నుంచి 19 వరకు జరిగిన ఈ క్యాంప్‌కు గ్రహణం మొర్రి సమస్యలతో బాధపడుతున్న పలు జిల్లాలకు చెందిన 140 మంది హాజరైనట్లు చెప్పారు. వీరికి రక్త పరీక్షలు, స్కానింగ్‌లు చేసిన తర్వాత శస్త్రచికిత్స చేయడానికి అనువుగా ఉన్న 78 మందికి ఉచితంగా ఆపరేషన్లు విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ల తర్వాత పూర్తిగా కొలుకున్న వీరందరినీ ఇళ్లకు పంపించామన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.భీమేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీ అనిల్ కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కళ్యాణి, ఆపరేషన్ స్మైల్ ప్రతినిధి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో స్నేహితుల సంబరం



పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 'పది' బ్యాచ్ విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): ఏరా అంజిబాబు.. అప్పుడెలా ఉన్నావో ఇప్పుడూ అలాగే ఉన్నావురా.. ఒరే బషీరు ఏంటిరా అలా ఐపోయావు.. మన శివగాడు మాత్రం అంతే ఉన్నాడ్రా.. అదిగో మన క్లాస్ లీడర్ పద్దూ చూడు అప్పటికీ ఇప్పటికీ అదే కమాండింగ్.. ఇలా 25 ఏళ్ల క్రితం ఒకే స్కూల్లో చదువుకున్న నాటి పూర్వ విద్యార్థులు తమ మధుర స్మృతులను మననం చేసుకున్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1998–99లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్నేహితుల సంబరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నాడు టీచర్లతో ఉండే అనుభూతి.. స్నేహితులతో చేసిన అల్లరి పనులు.. క్లాసులో జరిగిన గొడవలు.. ఉత్సవాలు.. పండగల సమయంలో కలిసి చేసిన స్కూల్ డెకరేషన్‌లు.. స్కూల్ గ్రౌండ్‌లో ఆడుకున్న ఆటలు.. పరీక్షల్లో రాసిన కాపీలను చిరునవ్వులతో తలచుకుని సంబరపడిపోయారు. ఈ సందర్భంగా స్నేహితుల సంబరం ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బషీర్ మాట్లాడుతూ.. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నామన్నారు. దైనందిన జీవితంలో నిరంతరం ఒత్తిడితో ఉండే తాము తమ స్నేహాన్ని 25 ఏళ్ల తర్వాత గుర్తుచేసుకునేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో స్నేహితుల సంబరం కమిటీ సభ్యులు నాగార్జున, చాముండేశ్వరి, గోపాలకృష్ణ, విజయలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతి సాహితీ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చేతి వృత్తులలో విశేషంగా రాణిస్తున్న వారిని గుర్తిస్తూ వారిని తగిన రీతిలో సత్కరిస్తున్నామని తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాచవరం గౌరీ శంకర్ పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి సాహితీ సేవ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం చిట్టినగర్ సొరంగం రోడ్డులోని శ్రీపుల్లేటికుర్తి విశ్వబ్రహ్మణ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డు, మాచవరం సేవా ఫౌండేషన్ వారి సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరీ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ కేఎస్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండపి వెంకట గణేష్‌బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శివస్వామి, ప్రముఖ పంచాంగకర్త పెదగాడి మోహన్‌రవి శంకర్, ప్రత్యేక అతిథిగా అయోధ్య రాముని లోహ పాదుకల రూపకర్త డాక్టర్ పెట్టంపల్లి రామలింగాచారి విచ్చేశారు. పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలో గత ఏడేళ్లగా సామాజిక సేవలు అందించిన వెస్కో ట్రస్ట్ అధ్యక్షుడు బంగారు తాతారావును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

మాజీ మంత్రి పాలడుగుకు ఘన నివాళి

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూజివీడు, హనుమాన్ జంక్షన్ ప్రాంత అభివృద్ధిలో మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు చెరగని ముద్ర వేశారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బాపులపాడు మండలం వేలేరులోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ రెసిడెన్షియల్ స్కూల్ (అమ్మ నిలయం) ప్రాంగణంలో మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు 10వ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పాలడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. రాష్ట్ర మంత్రిగా, నూజివీడు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పాలడుగు రాజకీయ జీవితం ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. అనంతరం అమ్మ నిలయంలోని అనాథ బాలలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ కాకాని వెంకటేశ్వరరావు (బాబు), పుర ప్రముఖులు ఆవిర్నేని రాధాకృష్ణ, వడ్లపూడి నాగేశ్వరరావు, దోనవల్లి మురళీకృష్ణ, చింతా లక్ష్మీరాఘవన్, గంధం నారాయణ, కన్నెకంటి రామ్మోహనరావు, నందిగం రామకృష్ణ, యనమదల కిషోర్, ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా కోరుతూ నిరసన



యనమలకుదురులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నేతలు



కంకిపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం శ్రేణులు



గన్నవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

పెనమలూరు: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిషా వెంటనే రాజీనామా చేయాలని వామపక్ష నేతలు కోరారు. యనమలకుదురు అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం అమిత్‌షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా ఎన్నికై హోంమంత్రిగా పని చేస్తున్న అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించటం పట్ల తీవ్రంగా ఖండించారు. ఇది క్షమించరాని నేరమని అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెనమలూరు సీపీఐ కన్వీనర్ మున్నంగి నరసింహారావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అమిత్‌షా మాట్లాడిన మాటలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. రెడ్‌ఫ్లాగ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరీదు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కేంద్రహోం మంత్రిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక్ మస్తాన్, షేక్ బాబు, పాతాళ లక్ష్మి, వాటపల్లి శ్రీరాములు, కొప్పుల విజయ్‌బాబు, మాదు నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

కంకిపాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో కంకిపాడు, గొడవర్రు, కోమటిగుంట గ్రామాల్లో అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహాల వద్ద ధర్నాలు చేపట్టారు. అమిత్ షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్, నాయకులు వి.మరియదాసు, వి.శివశంకర్, వై.జోజి, వి.జాన్‌మోజెస్, జె.రవి, చింతాల్, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. అమిత్‌షా ఏపీ పర్యటన నేపథ్యంలో ఆదివారం స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గోబ్యాక్..అమిత్‌షా అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి వర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వామపక్ష నేతలు మల్లంపల్లి ఆంజనేయులు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, బడుగు మరియదాసు, ఉదయభాస్కర్, కట్టవరపు విజయరావు, కె.మోహన్‌రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలతో తప్పని అవస్థలు

నామమాత్రంగా స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్



సీఎస్ఐ చర్చి వద్ద చెత్త కుప్ప



చెరువు సెంటర్ సప్తగిరి బ్యాంక్ ఎదురుగా పేరుకుపోయిన చెత్త

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పేరుకుపోతున్న చెత్త కుప్పలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని ప్రధాన జంక్షన్ల వద్ద రోజులతరబడి చెత్త కుప్పలు ఉండటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు చెత్త కుప్పల నుంచి వస్తున్న దుర్వాసనతో ముక్కు మూసుకొని నడుస్తున్నారు. చెత్త కుప్పల్లో ఆహారవ్యర్థాలు డంప్ చేయడంతో కుక్కలు, పందులు చెత్త కుప్పల వద్ద స్వైర విహారం చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య ప్రధానంగా సీఎస్ఐ చర్చి వద్ద, సప్తగిరి బ్యాంక్ వద్ద, యూనియన్ బ్యాంక్ వద్ద ఇంకా పలు సెంటర్లలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రజలు నివసించే ప్రాంతాల్లో చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులు చెప్పడమే కాని అమలు జరగడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఇదేనా స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్..

గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో గ్రామ సిబ్బంది పాటోలకు ఫోజులిస్తున్నారే తప్ప చెత్తసేకరించి చెత్తడంపింగ్ కేంద్రాలకు మాత్రం పంపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్త సేకరణలో ఎటువంటి లోపం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిత్యం వ్యర్థాల సేకరణ కచ్చితంగా జరుగుతుండాలని ఉన్నతాధికారులు ఆదేశించడమే కానీ పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. అధికారులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశుభ్రతకు సంబంధించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



లబ్బీపేట(విజయవాడతూర్పు): సరళమైన భాష, స్థానిక యాసలను ఉపయోగించడంలో ప్రసిద్ధి చెందిన వేమన పద్యాలు అందరికీ అర్థమయ్యేలా ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. యోగి వేమన జయంతి వేడుకలను ఆదివారం నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. వేమన తెలుగు భాషలో కవి, తత్వవేత్త అని, రాష్ట్రంలోని కడపలో 1652వ సంవత్సరంలో జన్మించారన్నారు. ఇప్పటికీ ఆయన పద్యాలు అన్ని వర్గాలకు అర్థమయ్యేలా ఉంటాయని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, డీఈఓ జ్యోతి, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.